



# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక






సంపుటి: 01 సంచిక : 266. ఎడిటర్ : సింగిడి అమృత్ తెలంగాణ గురువారం.10.07.2025 పేజీలు:4, వెల:రూ.1.00

# కేసీఆర్, జగన్ అనుబంధంతో తెలంగాణకు తీరని నష్టం

హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్ అనుబంధం మూలంగానే తెలంగాణకు తీరని నష్టం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ ప్రజలకు మరణశాసనం రాసే అధికారం కేసీఆర్‌కు ఎవరూ ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం వాదించి ఉంటే హైదరాబాద్‌కు తాగునీటిని సాధించే వాళ్లమని అభిప్రాయపడ్డారు. కృష్ణాజలాల అంశంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు సీఎంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మెన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ' బేసిన్లు లేవు, బేషజాలు లేవని కేసీఆర్ గతంలో అన్నారు. గోదావరి నుంచి 3000 టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని చెప్పారు. గోదావరి, కృష్ణా, పెన్నా బేసిన్ వరకు నీళ్లు తరలించుకోవచ్చన్నారు. రాయలసీమను రతనాల సీమ చేస్తామన్నారు. జగన్‌కు సూచనలతోపాటు టెండర్లు, జీవోలు ఇచ్చేలా సహకరించారు. ఉమ్మడి కోటా నుంచి హైదరాబాద్‌కు తాగునీటి జలాలను వేరు చేయాల్సి ఉంది. నగరంలో ఏపీ ప్రజలు 20 శాతం వరకూ ఉన్నారు

హైదరాబాద్‌కు ఉమ్మడి జలాల నుంచి తాగునీరిచ్చేలా కేసీఆర్ చర్చించాల్సి ఉంది. మిగిలిన జలాలను పరివాహక ప్రాంతాలకు పంపకాలు చేసి ఉంటే బాగుండేదన్నారు. తుంగభద్ర, కృష్ణా, బీమా జలాలు తొలుత గద్వాలకు వస్తాయి. తెలంగాణకు వచ్చిన వెంటనే ఒడిసిపట్టుకోవాల్సి ఉంది. వెంటనే పాలమూరు-రంగారెడ్డి , నల్లగొండ ఇతర ప్రాంతాలకు తరలించాలి. తెలంగాణ వదిలితేనే ఏపీ ప్రాజెక్టులకు నీళ్లు వెళ్తాయి. రాష్ట్రానికి వచ్చినప్పుడు వదిలేసి ఏపీ నుంచి తిరిగి వచ్చాక చివరకు తీసుకునేలా చేశారు. రాయలసీమకు వెళ్లిన జలాలను ఏపీ ఒడిసిపట్టుకుంటున్నది. జూరాల నుంచి తెచ్చుకుంటే ఏపీ జలాలను కొల్లగొట్టే అవకాశం ఉండేది కాదు. కేసీఆర్ నిర్ణయాలు కృష్ణా పరివాహక ప్రాంతాల రైతులకు మరణశాసనంగా మారాయి. ప్రాజెక్టుల్లో రాష్ట్రానికి వాటా వస్తే తక్కువ ధరకు విద్యుత్ దక్కేది' అని సీఎం అభిప్రాయపడ్డారు.

కేసీఆర్ వెయ్యి రెట్ల ద్రోహం

"ఉమ్మడి ఏపీలో సీమాంధ్ర పాలకులు చేసిన అన్యాయానికి వెయ్యి రెట్లు కేసీఆర్ ద్రోహం చేశారు. సీమాంధ్ర పాలకులకు ఒక కొరడా దెబ్బ పడితే, కేసీఆర్‌ను వెయ్యి దెబ్బలు కొట్టాలి. గతంలో పాలమూరు-రంగారెడ్డి సామర్థ్యాన్ని ఒక టీఎంసీకి తగ్గించారు. ఏడాదికి కిలోమీటర్ టన్నెల్ పూర్తిచేసి ఉంటే ఎస్ఎల్‌బీసీ పూర్తయ్యేది. గతంలో రూ. 1000 కోట్ల ప్రాజెక్టు అంచనా రూ. 3000 కోట్లకు పెరిగింది. 3.64 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే ఎస్ఎల్‌బీసీని పక్కన పెట్టారు. కృష్ణా జలాలను దారిదోపిడీ చేసే అవకాశం ఏపీకి కేసీఆర్ ఇచ్చారు" అని సీఎం విమర్శించారు.

ఎర్రవల్లిలో మాక్ అసెంబ్లీ

"కేసీఆర్ పాలనలో నిర్ణయాలు, మా పాలనలో నిర్ణయాలపై చర్చిద్దాం. వీధుల్లో, పబ్బుల్లో, క్లబ్బుల్లో కాకుండా అసెంబ్లీలో చర్చిద్దామన్నా.. దయచేసి నన్ను క్లబ్బులు, పబ్బులకు పిలవొద్దు..నేను రాను కేసీఆర్ ఏ తేదీ చెబితే అప్పుడు అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తాం.. స్పీకర్ అనుమతితో నిపుణులను కూడా అసెంబ్లీకి ఆహ్వానిస్తాం.. సభా నాయకుడిగా హామీ ఇస్తున్నా..ఎలాంటి గందరగోళం లేకుండా సభ నిర్వహిస్తాం.. ప్రశాంత వాతావరణంలో అర్థవంతమైన చర్చ నిర్వహిద్దాం..కేసీఆర్ అసెంబ్లీకి రావాలి. ఆయన ఆరోగ్యంగా ప్రజాజీవితంలో ఉండాలి. కేసీఆర్‌కు ఇబ్బంది లేకుంటే ఎర్రవెల్లి ఫామ్‌హౌజ్‌లోనే చర్చపెడదాం. అక్కడే మాక్ అసెంబ్లీ నిర్వహిద్దాం. నాకేమీ భేషజాలు లేవు. కేసీఆర్ నాకంటే చాలా సీనియర్. నేను కూడా రావాలని కోరుకుంటే తప్పకుండా వెళ్తా. ఫామ్‌హౌజ్‌లో భేటీకి కేసీఆర్ తేదీ నిర్ణయించి చెప్పాలి. ఎర్రవెల్లికి మంత్రుల బృందాన్ని పంపిస్తా. కేసీఆర్‌కు ఇబ్బంది లేకుండా అక్కడే చర్చిద్దాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు.

గొడవలను గమనిస్తున్నారు

"నేపాల్‌లో ఓ యువరాజు కుటుంబంలో అందర్నీ చంపి రాజయ్యాడు. కేసీఆర్ కుటుంబంలో సమస్య ఉంటే కూర్చుని మాట్లాడుకోవాలి. కులపెద్దలు, పెద్ద మనుషులతో మాట్లాడుకుని పరిష్కరించుకోవాలి. కేసీఆర్ కుటుంబ గొడ వలు వీధి బాగోతాల్లా ఉన్నాయి. బావ, బావమరిది, చెల్లి గొడవలను జనం గమనిస్తున్నారు" అని సీఎం




అన్నారు.

వాటిని పూర్తిచేస్తే కృష్ణా జలాల్లో న్యాయం జరిగేది ఎన్డీఎస్ఏ ప్రకారం బ్యారేజీల పునరుద్ధరణ : నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్

గత పదేండ్లల్లో కొన్ని ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసి ఉంటే కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయం జరిగేదని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కానీ, గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. ఎన్డీఎస్ఏ మార్గదర్శకాల ప్రకారం కాళేశ్వరం బ్యారేజీలను పునరుద్ధరిస్తామని ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల అంశంపై ప్రజాప్రతినిధులకు ప్రజాభవన్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ '1976లో బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు చేసింది. మూడు రాష్ట్రాలకు 2130 టీఎంసీలు కేటాయించింది. ఉమ్మడి ఏపీ 811, కర్నాటక 734, మహారాష్ట్రకు 585 టీఎంసీలు ఇచ్చింది. బచావత్ ట్రిబ్యునల్ తర్వాత కేంద్రం ఆమోదం లేకుడా ఉమ్మడి ఏపీలో ప్రాజెక్టులు చేపట్టారు. ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి, నెట్టెంపాడు, డిండి, పాలమూరు-రంగారెడ్డి, కోయిల్‌సాగర్, బీమా ప్రాజెక్టులు చేపట్టారు. ఉమ్మడి ఏపీలో 261 టీఎంసీలతో ప్రాజెక్టులు చేపట్టినా పూర్తిచేయలేదు. ఈ ప్రాజెక్టులు గత పదేండ్లల్లో పూర్తి చేసి ఉంటే కృష్ణా జలాలల్లో న్యాయం జరిగేదని' వ్యాఖ్యానించారు.

సామర్థ్యాన్ని పెంచుకుంది

'ఆల్మట్టి ప్రాజెక్టుపై ఉమ్మడి ఏపీ హయాంలో సుప్రీంకోర్టులో కేసు వచ్చింది. తెలంగాణకు 575 టీఎంసీలు ఇవ్వాలని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపించాం. ఏపీకి 236 టీఎంసీలు ఇవ్వాలని ట్రిబ్యునల్ ముందు తెలంగాణ వాదించింది. గత ప్రభుత్వం ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని చెప్పింది. 2016లో అపెక్స్ కౌన్సిల్‌కు 66:34 శాతంపై లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. 2025 మార్చిలో తెలంగాణకు 71 శాతం కృష్ణా జలాలు ఇవ్వాలని లేఖ రాశాం. తెలంగాణ వచ్చిన తర్వాత కృష్ణా జలాల్లో ఎక్కువ అన్యాయం జరిగింది. మల్యాల సామర్థ్యాన్ని 3850 నుంచి 6300 క్యూసెక్కులకు పెంచారు. 2017లో రాయలసీమకు రోజూ 1.09 టీఎంసీలు తీసుకునే సామర్థ్యాన్ని ఏపీ పెంచుకుందని' ఉత్తమ్ చెప్పారు.

అపెక్స్ కౌన్సిల్ వాయిదా

'2020లో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల నుంచి 92 వేల క్యూసెక్కులకు ఏపీ పెంచుకుంది. జగన్ హయాంలో గోదావరి, కృష్ణా జలాలపై ప్రగతిభవన్‌లో చర్చించారు. శ్రీశైలం నుంచి ఏపీకి కృష్ణాజలాల తరలింపునకు పునాదులు పడ్డాయి. రాయలసీమ లిఫ్ట్ పూర్తయితే శ్రీశైలం, సాగర్ అవసరాలపై వినాశన ప్రభావం ఉంటుంది. నాగార్జునసాగర్ ఆయకట్టు పూర్తిగా ఏడారిగా మారే ప్రమాదం ఉంది. 2020లో ఏపీకి మేలు చేసేలా కుట్రపూరిత చర్యలు చేపట్టారు. అపెక్స్ కౌన్సిల్ భేటీకి హాజరయ్యారు. అపెక్స్ కౌన్సిల్ భేటీ వాయిదా వేయక ముందే హాజరైతే బాగుండేది. రాయలసీమ టెండర్లపై కేంద్రం స్టే విధించేలా చర్యలు ఉండవేమో, రాయలసీమ లిఫ్ట్ టెండర్ల ప్రక్రియ పూర్తికి గత ప్రభుత్వం సహకరించింది. 2019కి ముందే పాలమూరు పూర్తిచేసి ఉంటే రాష్ట్రానికి న్యాయం జరిగేది' అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# టీచర్లూ బడికి పోవాల్సిందే



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ప్రభుత్వ, స్థానిక సంస్థలు, మోడల్ స్కూళ్లు, తెలంగాణ సాధారణ గురుకులాలు, కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో చదువుతున్న విద్యార్థులకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు (ఎఫ్ఆర్ఎస్) విధానం అమలవుతున్నది. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పనిదినాల్లో వెళ్తున్నారా? లేదా? అనేదానిపై పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేదు. దీంతో కొందరు టీచర్లు దుమ్మా కొట్టినా అడిగే వారే లేరు. సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఓ టీచర్ బడికి వెళ్లకుండా తన స్థానంలో విద్యావాలంటీర్‌ను నియమించినట్టు సమాచారం. మరికొన్ని పాఠశాలల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉపాధ్యాయులుంటే వారు రోజు వారీగా మాట్లాడుకుని ఒక వారం కొందరు టీచర్లు, ఇంకోవారం ఇంకొందరు టీచర్లు వెళ్తున్నట్టు తెలిసింది. వారందరూ నెలలో అన్ని పనిదినాల్లో వచ్చినట్టు రిజిస్టర్‌లో సంతకాలు మాత్రం చేస్తున్నట్టు సమాచారం. ఇలా ఉపాధ్యాయులు సక్రమంగా బడులకు హాజరు కావడం లేదంటూ ఆరోపణలు వస్తున్నాయి. దీనికి చెక్ పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి ఫేషియల్ రికగ్నిషన్ హాజరు (ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఉపాధ్యాయులకు ఎఫ్ఆర్ఎస్ అమలుకు అనుమతి ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. ప్రభుత్వ అనుమతి రాగానే రాష్ట్రంలోని అన్ని సర్కారు బడుల్లోని ఉపాధ్యాయులకు ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని అమలు చేయనుంది. ఈ విధానం అమల్లోకి వస్తే ఉపాధ్యాయులు దుమ్మా కొట్టడానికి అవకాశముండదు. ఒకరికి బదులుగా మరొకరు పాఠశాలకు హాజరయ్యేందుకు వీలుండదు. ఆ విధానం అమల్లోకి వస్తే రిజిస్టర్‌లో సంతకం చేయాల్సిన అవసరం ఉండదు. ఆన్‌లైన్ ద్వారానే ఉపాధ్యాయుల హాజరును పరిగణనలోకి తీసుకుంటారు. ఎవరు గైర్హాజరయ్యారో వెంటనే తెలిసిపోతుంది. ఎఫ్ఆర్ఎస్ విధానంతో ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా బడికి పోవాల్సిందేనని తెలుస్తున్నది. అయితే పర్యవేక్షణ సక్రమంగా లేకున్నా బడికి రోజూ సక్రమంగా వెళ్తూ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు కూడా లేకపోలేదు. అలాంటి ఉపాధ్యాయులు ఉండడం వల్లే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్)లో తెలంగాణ స్థానం మెరుగైంది.

ప్రత్యేకంగా యాప్ రూపకల్పన

రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరంలో 30,137 ప్రభుత్వ పాఠశాలల్లో 23,71,772 (38.89 శాతం) మంది విద్యార్థులు చదివారు. 1.10 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఉపాధ్యాయులకు ఎఫ్ఆర్ఎస్ అమలు కోసం పాఠశాల విద్యాశాఖ ప్రత్యేకంగా డీఎస్ఈ-ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రూపకల్పన చేసింది. ఉపాధ్యాయులు స్మార్ట్ ఫోన్లలో ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. అందులోనే హాజరును నమోదు చేయాలి. ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరైన కచ్చితమైన సమయం కూడా నమోదవుతుంది. ప్రస్తుతం వందల మంది ఉపాధ్యాయులు హైదరాబాద్ నుంచి వివిధ జిల్లాలకు ప్రయాణం చేస్తూ బడులకు వెళ్తున్నారు. వారిలో చాలా మంది పాఠశాల ప్రారంభమయ్యే సమయానికి చేరుకోవడం లేదు. ప్రార్థన సమయంలో ఎక్కువ మంది టీచర్లు ఉండడం లేదన్న ఫిర్యాదులు అధికారులకు అందుతున్నాయి. ఎఫ్ఆర్ఎస్ విధానం అమల్లోకి వస్తే ఆలస్యంగా వచ్చే ఉపాధ్యాయుల వివరాలు ప్రతిరోజూ విద్యాశాఖ అధికారులకు తెలిసిపోతుంది. హాజరును తెలుసుకోవడానికి గతంలో పాఠశాలకు వెళ్లాలి. ఎఫ్ఆర్ఎస్ ద్వారా పాఠశాలలకు వెళ్లకుండానే ప్రతిరోజూ హాజరుపై పర్యవేక్షణ పెరగనుంది.

ఇంకోవైపు సమయానికి టీచర్లు బడులకు వెళ్లడానికి అవకాశముంటుంది. దానివల్ల బోధన మెరుగవుతుందనీ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అధికారులు చెప్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం : నవీన్ నికోలస్

డీఎస్ఈ-ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని పైలట్ ప్రాజెక్టు కింద పెద్దపల్లి జిల్లాలో విజయవంతంగా అమలైందని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈ నవీన్ నికోలస్ చెప్పారు. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని అమలు చేశామని అన్నారు. అదే విధానాన్ని రాష్ట్రమంతా అమలు చేస్తామన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించామని వివరించారు. ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నామని అన్నారు.

# గుజరాత్‌లో కూలిన వంతెన




వదోదరా: అమృత్ తెలంగాణ: గుజరాత్‌లోని వదోదరలో బుధవారం తెల్లవారుజామున వంతెన కూలిన ప్రమాదంలో 10 మంది మృతి చెందారు. మరో ఆరుగురిని కాపాడారు. ఈ విషయాన్ని గుజరాత్ హోంమంత్రి సంఘ్వీ వెల్లడించారు. పద్రా వద్ద మహిసాగర్ నదిపై ఉన్న గంభీర వంతెన కూలటంతో నాలుగు వాహనాలు నదిలో పడ్డాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సహా వివిధ శాఖల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గల్లంతైన మరికొందరి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వదోదర-ఆనంద్ పట్టణాలను కలిపే గంభీర వంతెన కూలటంతో ఆ రెండు పట్టణాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుజరాత్ నుంచి సౌరాష్ట్రకు వెళ్లే వాహనాలకు ఈ వంతెన ప్రధాన మార్గంగా ఉంది. సరైన మరమ్మతులు లేకపోవడం వల్లే వంతెన కూలినట్టు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

సహాయక చర్యలు

బుధవారం తెల్లవారుజామున వంతెన కూలిన సమాచారాన్ని స్థానికులు అగ్నిమాపక దళం, రెస్క్యూ బందానికి అందించారు. అగ్నిమాపక శాఖ, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. ముగ్గురిని నది నుంచి సజీవంగా బయటకు తీశారు. ఇప్పటి వరకు ఆరు మృత దేహాలను గుర్తించగా, మరికొందరు నదీ గర్భంలో చిక్కుకుపోయినట్టు అనుమానిస్తున్నారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో అనేక వాహనాలు వంతెన మీదుగా వెళుతున్నాయని స్థానికులు చెప్పారు. వదోదర, ఆనంద్ జిల్లాల అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

# తెలంగాణ రాష్ట్రానికి ఎరువుల కొరత తీరుస్తాం





హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: తెలంగాణ రైతాంగానికి ఎరువుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని కేంద్ర రసాయన, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా రాష్ట్రానికి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరతపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నడ్డాను కలిసింది. రాష్ట్రానికి సరిపడినంత యూరియా, ఎరువులను సరఫరా చేయాలని సీఎం రేవంత్ కోరారు. సీఎం విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈమేరకు బుధవారం సీఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. వానాకాలం సీజన్‌కు సంబంధించి జూలై, ఆగస్టు నెలల్లో యూరియాను నిరాటంకంగా సరఫరా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరిన విషయం తెలిసిందే. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి రైతుల అవసరాలను తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని నడ్డా హామీ ఇచ్చారు. రాష్ట్రానికి అవసరం మేరకు యూరియాను సరఫరా చేయాలని ఎరువుల శాఖ ఉన్నతాధికారులను అధికారులను నడ్డా ఆదేశించారు. యూరియాను వ్యవసాయేతర అవసరాలకు మళ్లించకుండా తగిన చర్యలు తీసుకోవాని సూచించారు.అన్ని జిల్లాలకు సమానంగా ఎరువులు పంపిణీ అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో రాష్ట్రంలో యూరియా వినియోగం పెరగడంపై కేంద్ర మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 2023-24 యాసంగితో పోలిస్తే 2024-25 యాసంగిలో యూరియా అమ్మకాలు 21శాతానికి పెరిగాయని గుర్తు చేశారు. రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించి, సేంద్రీయ, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రణామ్ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రోత్సాహకాలను అందిస్తోందని ఈ సందర్భంగా జేపీ నడ్డా ప్రస్తావించారు.

# గుజరాత్ యూనివర్సిటీలో కలకలం

వదోదరా: అమృత్ తెలంగాణ: వదోదరలోని మహారాజా సాయాజీరావు విశ్వవిద్యాలయంలోని ఎస్‌డీ హాల్ హాస్టల్ లో 100 మందికిపైగా విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం రాత్రి సమయంలో హాస్టల్‌లో డిన్నర్ చేసిన తర్వాత వారంతా ఇబ్బందికి గురయ్యారు. భోజనం చేసిన కొన్ని గంటల తర్వాత విద్యార్థులు విరేచనాలు, వాంతులు, తీవ్రమైన కడుపు నొప్పితో ఇబ్బంది పడ్డారు. మెస్‌లో భోజనం చేసిన సుమారు 350 మంది విద్యార్థుల్లో 100 మందికిపైగా విద్యార్థుల్లో ఫుడ్ ఇన్ఫెక్షన్ లక్షణాలు కనిపించాయి. హాస్టల్ యాజమాన్యం వెంటనే విద్యార్థులను చికిత్స నిమిత్తం గోత్రి, సాయాజీ ఆస్పత్రులకు తరలించారు.

ఫుడ్ పాయిజన్ వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురైనట్టు వైద్యులు తెలిపారు. కలుషితమైన ఆహారం వల్ల ఈ పరిస్థితి తలెత్తినట్లు అనుమానిస్తున్నారు. అయితే, అదృష్టవశాత్తూ విద్యార్థుల పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉన్నట్టు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

## సీఎం సహాయ నిధి చెక్కును అందజేసిన మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి....





నిర్మల్ జిల్లా నర్సాపూర్ జీ జూలై 9 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని చాక్పల్లి గ్రామానికి చెందిన SD మక్బూల్ అనే లబ్ధిదారునికి సుమారు 60 వేల రూపాయల సీఎం సహాయ నిధి చెక్కును అందించడం జరిగింది. చెక్కు మంజూరు చేసి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కి మరియు మన నిర్మల్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కు మరియు ముధోల్ మాజీ శాసనసభ్యులు జి విట్టల్ రెడ్డి,కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు. ఈ కార్యక్రమంలో చాక్ పెల్లి గ్రామం మాజీ సర్పంచ్ MD మాక్బుల్, షేక్ అఫ్రోజ్, MD అఖిల్, SD అన్వార్, షేక్ వొల్లి మరియు తదితరులు ఉన్నారు.

## బాసర త్రిబుల్ ఐటీ లో సీటు సాధించిన అర్షితకు సత్కారం..



త్రిబుల్ ఐటీ లో సీటు సాధించిన విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

నిర్మల్ జిల్లా బాసర జులై 9 అమృత్ తెలంగాణ బాసర త్రిబుల్ ఐటీలో నూతనంగా బీసీ – ఏ జాబితాలో గుర్తింపు పొందిన ఓడ్ కుల విద్యార్థిని అర్షితకు ఓడ్ కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పవార్ కైలాష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ శరత్ లు బుధవారం శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో దశాబ్దాలుగా గుర్తింపు లేకుండా విద్య, ఉద్యోగ మరియు సామాజిక వెనుకబాటుకు గురైన సంచార ఓడ్ కులం గుర్తింపు పొంది ఐదు సంవత్సరాలు అవుతోందిని అందులో భాగంగా విద్యాభివృద్ధికి రాష్ట్ర సంఘం ప్రధాన బాధ్యతగా పిల్లలను ప్రోత్సహిస్తుందని అన్నారు. అందులో భాగంగా అర్షిత బాసర త్రిబుల్ ఐటీలో సీటు సాధించడం పట్ల ఆనందంగా వ్యక్తం చేశారు. ఆమె మరింత కష్టపడి ఉన్నత స్థానానికి ఎదిగి తమ సమాజానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. త్వరలోనే పదో తరగతి, ఇంటర్ లలో మంచి మెరిట్ సాధించిన విద్యార్థులకు సత్కార కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కమిటీ సభ్యులు చవాన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గాయ పడిన జింక ప్రాణాలకు రెస్క్యూ చేసిన మహిళా కానిస్టేబుల్స్

### విజయవంతంగా కొనసాగుతున్న “నారిశక్తి” కార్యక్రమం.

### జిల్లా ఎస్పీ డా: జి. జానకి షర్మిల ఐపిఎస్




అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ ముధోల్ మండలంలోని బ్రహ్మణ్ గావ్ గ్రామ శివారులో కుక్కల దాడికి గురైన జింకను గమనించిన గ్రామస్తులు వెంటనే డయల్ 100 కు సమాచారం అందించారు. పెట్రో కారు విధులు నిర్వహిస్తున్న నారిశక్తి బృందం తక్షణమే స్పందించి ఘటన స్థలానికి చేరుకుని గాయ పడిన జింకను కాపాడారు. తరువాత గాయాలపాలైన జింకకు అవసరమైన వైద్యసహాయం అందించేలా చర్యలు తీసుకొని, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చి అటవీ శాఖ అధికారులకు అధికారికంగా ఆ జింక ను అప్పగించారు. తర్వాత పశు వైద్యాధికారి గారు చికిత్స అందించి అటవీ అధికారులకు అప్పగించారు. ఇట్టి విషయంలో తక్షణమే స్పందించి నారిశక్తి విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్స్ తేజస్విని మరియు విజేత లను పోలీస్ అధికారులు అభినందించారు. ఈ రెస్క్యూ లో నారిశక్తి బృందం మరియు అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహా నిధి చెక్కు అందజేసిన ముధోల్ మాజీ శాసనసభ్యులు జి.విట్టల్ రెడ్డి



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి

నిర్మల్ జిల్లా బాసర జూలై 9 అమృత తెలంగాణ బాసర మండల కేంద్రానికి చెందిన సులోచన అనే లబ్ధిదారులకి సుమారు 60 వేల రూపాయల సీఎం సహాయనిధి చెక్కును ఈరోజు వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది చెక్కు మంజూరు చేసి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కి మరియు నిర్మల్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు,కి మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన బాధితుడు ఈ కార్యక్రమంలో బాసర గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్ రావు, మరియు కిర్గుల్ బి గ్రామ మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, దేగాం గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,మరియుకాంగ్రెస్ సీనియర్ నాయకులు మిలింద్ ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడ్ని పరామర్శించిన మార్కెట్ కమిటీ చైర్మన్.



నాకిడి నవీన్ ను పరమర్శిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ సిందె ఆనందరావు పటేల్

నిర్మల్ జిల్లా గొల్లమాడ జులై 9 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని కాంగ్రెస్ కార్య కర్తను బుధవారం భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద్ రావు పటేల్, ఇటీవలే మోకాలికి శాస్ర చికిత్స చేయించుకున్న కాంగ్రెస్ పార్టీకి గొల్లమాడలో పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తున్న యువ నాయకుడు నాకిడి నవీన్,ను పరామర్శించటం జరిగింది ఆయనవెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సాయినాథ్, భగవాన్ పటేల్, సీనియర్ నాయకులు ప్రశాంత్ సలీం, లక్ష్మన్, తదితరులు ఉన్నారు

## మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి


అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి మరియు స్త్రీ – శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్క జన్మదినం సందర్భంగా ములుగు నియోజకవర్గం లో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకల్లో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి గారు పాల్గొని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. శ్రీకాంత్ రెడ్డి వెంట బోథ్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రఫుల్ రెడ్డి, సిరికొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ ఇమామ్, మావల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, కో –ఆప్షన్ మెంబర్ రహీమ్ ఖాన్, సీనియర్ నాయకులు నలిమేల నవీన్ రెడ్డి, కుదురుపాక సురేష్, రెండ్ల రాజన్న, అక్షయ్, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి షాదీముబారక్ చెక్కుల పంపిణీ

### పాల్గొన్న ఎమ్మెల్యే రామారావు పటేల్,



కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను మార్కెట్ కమిటీ చైర్మన్ ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నిర్మల్ జిల్లా నర్సాపూర్, జి జూలై 9 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలం గొల్లమడ గ్రామంలో రైతు వేదిక నందు ఆయా గ్రామాల లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనీ 39 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేసిన ముధోల్ శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్, ఈ కార్యక్రమంలో తహశీల్దార్, శ్రీకాంత్ తాజా మాజీ సర్పంచులు ,ఎంపీటీసిలు,

మండల నాయకులు , కార్యకర్తలు , రెవెన్యూ అధికారులు, తదితరులు ఉన్నారు.

## దిశ సమావేశాల్లో పాల్గొన్న జిల్లా నాయకులు...

### బిజెఎల్పి నేత ఎమ్మెల్యేలు..



దిశ మీటింగ్ లో ఎమ్మెల్యేలు



హాజరైన వివిధ శాఖల అధికారులు

నిర్మల్ జిల్లా జులై 9 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన దిశా మీటింగ్ లో పాల్గొన్న బిజెఎల్పి నేత ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే రామారావు పటేల్, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, , ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జాయింట్ కలెక్టర్ కిషోర్ కుమార్ , జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బిజెఎల్పి నేత ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, పలు శాఖల సమస్యలపై చర్చిస్తూ నియోజకవర్గంలో విద్యుత్ సంబంధించి ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు . చాలా గ్రామాల్లో విద్యుత్ స్తంభాల కొరత అధికంగా ఉందని వాటిని సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలకు సంబంధించి సమీక్ష నిర్వహించి, పలు సూచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విషయంలో శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు.నిధుల వినియోగం పథకాల నిర్వహణ తోపాటు పెండింగ్ పనులపై వారు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు

## ఆయిల్ పామ్ సాగు పై వ్యవసాయ ఉద్యాన శాఖల సంయుక్త సమావేశం





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షతన ఆయిల్ పామ్ సాగుపై వ్యవసాయ , ఉద్యాన శాఖలతో సంయుక్త సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ” జిల్లాలోని రైతులు ఆయిల్ ఫాం సాగుకు ముందుకు రావాలని కోరారు ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభదాయకమని వ్యవసాయ ఉద్యాన శాఖలు సంయుక్త కృషి తో 2025 26 సాగు లక్ష్యాలను పూర్తి చేయాలనీ తెలిపారు. అలాగే మండల వ్యవసాయ అధికారి వారిగా సాగు లక్ష్యాలను నిర్దేశించి ,పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు . ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి ,జిల్లా ఉద్యాన,

పట్టు పరిశ్రమ శాఖ అధికారి S.సుధాకర్ , ప్రియునిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ DGM మల్లేశ్వరరావు వ్యవసాయ & ఉద్యాన అధికారులు వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయివేట్ ఆస్పత్రిలో అబార్షన్లు ఘటనలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన..

భువనగిరి :అమృత్ తెలంగాణ: భువనగిరి జిల్లా కేంద్రంలో నిన్న ప్రయివేట్ ఆస్పత్రిలో లింగ నిర్ధారణ, అబార్షన్లు చేసిన ఘటనలో నేరస్తులను వెంటనే విడుదల చేసినందుకు నిరసిస్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి,రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిందితులకు వెంటనే శిక్షపడేలా చెయ్యాలని, ఇలాంటి సంఘటనలు పట్టణంలో మళ్లీ జరగకుండా చూడాలని నిందితులను కఠినంగా శిక్షించాలని, నిందితులను కొంత మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు , భువనగిరి శాసనసభ్యులు కాపాడడం జరిగిందని ఆరోపించారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి నీ కలిసి ఇలా కొన్ని ప్రైవేటు ఆసుపత్రులలో లింగ నిర్ధారణ అబార్షన్లు చేయడం జరుగుతుందనీ ఆస్పత్రులను కలెక్టర్, డిహెచ్ఎంఓ లు పరిశీలించి అలాంటి ఆస్పత్రులపై తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, బిఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి,రచ్చ శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీలు అతికిం లక్ష్మీనారాయణ గౌడ్, సూరపల్లి రమేష్, మాజీ జెడ్పిటిసి, సందెల సుధాకర్,నాయకులు ఇట్టబోయిన గోపాల్, కుశంగల రాజు, బర్రె రమేష్,తాడూరు బిక్షపతి, దొడ్డికాడి భగత్, కంచి మల్లయ్య, ఎక్బాల్ చౌదరి, బబ్లు, కాజం, కస్తూరి పాండు,ఇస్మాయిల్, ముజీబ్,అంజద్, రహీం,రత్నపురం పద్మ, ఇట్టబోయిన పావని, వనజ, అశోక్, సిల్వేరు మధు, ప్రవీణ్,పెంటనితీష్ నాగారం సూరజ్, చిన్న, షాగంటి నరసింహ, పాల్గొన్నారు.



# నానో-డి.ఎ.పి వాడకం పై అవగాహన సమావేశం






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం వ్యవసాయ శాఖ , ఉద్యాన శాఖ అధికారులతో కలసి నానో-డి.ఎ.పి వాడకం, ఆవశ్యకతపై అవగాహన కల్పించే సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని కోరమండల్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నాడు కోరమాండెల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నానో ఎరువులపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రైతులకు నానో ఎరువుల ఉపయోగం, వ్యవసాయంలో వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. సాంకేతికత ఆధారిత వ్యవసాయ విధానాలు స్వీకరించాల్సిన అవసరం ఉందని, నానో ఎరువులు మట్టి ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాక, పంట దిగుబడుల పెంపును కూడా కలుగజేస్తాయని పేర్కొన్నారు. రైతులు ఈ కొత్త పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ సందర్భంగా కోరమండల్ కంపెనీ దక్షిణ మండల అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, "గ్రోమోర్ నానో డి.ఎ.పి. పంటల ఆధారంగా సాంప్రదాయ డి.ఎ.పి వాడకాన్ని ½ నుండి 1 బస్తా వరకు భర్తీ చేయగల సామర్థ్యం కలిగి ఉంధని , దీని లోని 60%-%80% నానో కణాలు 50 నానో మీటర్ల కన్నా చిన్నవి కావడంతో, ఇవి విస్తృత ఉపరితలాన్ని కవర్ చేయగలవని అన్నారు.

ఈ ద్రవరూప ఎరువు వాడకం ద్వారా వ్యవసాయ రంగంలో ఒక విప్లవాత్మక మార్పు సంభవించనుందని తెలిపారు.. కోరమాండెల్ సంస్థ ప్రతినిధులు శిక్షణలో నానో ఎరువుల తయారీ విధానం, వాటి ప్రయోజనాలు, వాడే విధానం వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ కంపెనీ తరఫున సీనియర్ ఏ.వి.పీ. భాస్కర్ రెడ్డి, డా. సుధాకర్ రెడ్డి (డివిజనల్ అగ్రోనమిస్ట్), మాధవన్, నాగరాజు పాల్గొన్నారు. ట్రైనీ కలెక్టర్ సలోని ఛాబ్రా జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, జిల్లా ఉద్యానశాఖ అధికారి సుధాకర్ , తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ పోలీసుల సత్వర స్పందన - పోగొట్టుకున్న రూ.2,48,000 నగదును జిల్లా ఎస్పీ డా: జి.జానకి షర్మిల ఐపిఎస్ చేతుల మీదుగా బాధితునికి అప్పగింత



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ తేదీ 08.07.2025 రోజున అనగా నిన్న ఉదయం ఓ వ్యక్తి బైక్ నడుపుతూ ఫోన్‌లో మాట్లాడుతుండగా, తన బైక్ పౌచ్ నుండి రూ. 2,48,000 నగదు రోడ్డుపై అనుకోకుండా జారిపడింది. ఈ దృశ్యాన్ని గమనించిన విజయ్ కుమార్ అనే వ్యక్తి వాహనదారున్ని పలుమార్లు పిలిచినప్పటికీ అతడు పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. దీంతో నిజాయితీతో స్పందించిన విజయ్ కుమార్ ఆ నగదును స్వాధీనం చేసుకుని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపిఎస్ గారిని కలిసి నగదును అప్పగించారు. ఇక ఇంటికి చేరుకున్న బాధితుడు తన నగదు కోల్పోయిన విషయాన్ని గ్రహించి వెంటనే పోలీసులను సంప్రదించాడు. దీనిపై ఎస్పీ గారు తక్షణమే ఆదేశాలు జారీ చేసి, సాంకేతిక ఆధారాలతో కూడిన విచారణ జరిపి, అసలైన బాధితుడిని గుర్తించి నగదు అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. నిర్మల్ పోలీసులు ఆధారాలు సేకరించి బాధితున్ని ధృవీకరించి, ఈ రోజు జిల్లా ఎస్పీ డా:జి.జానకి షర్మిల గారి చేతుల మీదుగా నగదును బాధితునికి అప్పగించారు. ఇంత తక్కువ సమయంలో కోల్పోయిన డబ్బును తిరిగి అప్పగించినందుకు,బాధితుడు జిల్లా ఎస్పీ మరియు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

# పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలి - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్






అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని దివ్య గార్డెన్స్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టేందుకు పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, ప్రతి విద్యార్థికి పాఠశాల స్థాయిలోనే చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. మండలాల వారీగా ఎంఈఓలు ప్రతి పాఠశాలలో ఈ చట్టంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. 2012లో అమలులోకి వచ్చిన ఈ చట్టం ప్రకారం 18 ఏళ్ల లోపు బాలలపై లైంగిక నేరాలకు పాల్పడినవారికి కఠిన శిక్షలు విధించే అవకాశం ఉందని చెప్పారు. అలాగే ఈ కేసుల విచారణ వేగంగా పూర్తయ్యేలా చట్టం రూపొందించబడిందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న నిపుణుడు డేవిడ్ రాజు ఉపాధ్యాయులకు పోక్సో చట్టం, పాఠశాలల నిర్వహణ, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, అధికారులు పోక్సో చట్టంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాల్గొన్న విద్యార్థులు, వక్తలకు, ఎన్‌సీసీ సభ్యులకు కలెక్టర్ జ్ఞాపికలు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీవాణి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ రాధిక, జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు, ఎంఈఓలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పల్లాను పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



భువనగిరి :అమృత్ తెలంగాణ: మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఫామ్ హౌస్ లో ప్రమాదవశాత్తు కాలుజారి పడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డిని బుధవారం మోహినాబాద్ ఫామ్ హౌస్ లో భువనగిరి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జనగం పాండు ఆధ్వర్యంలో కలిసి, పరామర్శించారు. ఈ నేనథ్యంలో త్వరగా కోలుకోవాలని యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామిని వేడుకున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాదారం రాము కుమార్, పట్టణ నాయకులు సిరిపంగ సుభాష్, బోనగిరి మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పల్లపాటి రవికుమార్ లు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ లో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన బుద్ధునితో నా ప్రయాణం







ఆదిలాబాద్ లో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన బుద్ధునితో నా ప్రయాణం తెలుగు నాటకం జిల్లా పరిషత్ హాల్ లో జరిగింది ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ శాసన సభ్యుడు శ్రీ పాయల్ శంకర్ డిప్యూటీ కలెక్టర్ శమాల దేవి ఎస్సీ కార్పొరేషన్ ఈ డి శ్రీనివాస్ రావు డీ డీ సునీత మేడం మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ బేర దేవన్న అసోసియేట్ అధ్యక్షుడు పాశం రాఘవేంద్ర సోగల సుదర్శన్ ప్రజ్ఞాకుమార్ మస్తక్ అశోక్ వారితో పాటు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు తెలిపారు

# నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి..



తుర్కపల్లి :అమృత్ తెలంగాణ: కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలకు నిరసనగా బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సిఐటియు తుర్కపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం నుండి తెలుగు తల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపైన రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పోతరాజు జహంగీర్ పాల్గొని మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానికి పూర్వం నుండి బ్రిటిష్ వారిపై సైతం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లను కార్పొరేట్ ల ప్రయోజనం కోసం తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు కొక్కొండ లింగయ్య, సిఐటియు మండల కన్వీనర్ తూటి వెంకటేశం, జిల్లా సిఐటియు నాయకులు గడ్డమీది నరసింహ, మహిళా సంఘం మండల కార్యదర్శి ఆవుల కలమ్మ, ట్రాన్స్పోర్ట్ రంగం జిల్లా నాయకులు గుండెబోయిన బలరాం,

గుండెబోయిన వీరేశం, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్, గ్రామపంచాయతీ రంగం నాయకులు బాచ్య నాయక్, దస్సింగ్, చాగ బిక్షపతి, గడిపే లక్ష్మి, సుశీల, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మోడీ తెచ్చిన 4 లేబర్ కోడ్ లు రద్దు చేయాల్సిందే..



బొమ్మల రామారం :అమృత్ తెలంగాణ: కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాపిత సమ్మె కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బొమ్మలరామారం మండలంలో కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి అనంతరం సభ నిర్వహించారు. కేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ర్యకల శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రాజు, జగన్ ,బాలరాజ్ మణెమ్మ అంగన్వాడీ టీచర్ నాగమణి ప్రమీల మంజుల రేణుక సుజాత శ్రీలత భవాని సంతోష్ గోవిందమ్మ ఉమారాణి సబిత తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబాలకు ఆసరా బుసిరెడ్డి పాండన్న



పెద్దవూర :అమృత్ తెలంగాణ: నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండన్న ఆత్మబంధు కార్యక్రమంలో భాగంగా భోజనాలు పంపించారు. ప్రతిఒక్క నిరుపేదకు వెన్నుదన్నుగా నిలుస్తున్న నాగార్జునసాగర్ నియోజకవర్గానికి ఆపద్బాంధవుడిలా నిలుస్తున్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని అనుముల మండలం చల్మారెడ్డి గూడెం గ్రామానికి చెందిన ఇరిగిలి లింగమ్మ, హాలియా మున్సిపాలిటీకీ చెందిన నారుమల్ల వెంకటమ్మ, మృతి చెందారు. విషయం తెలుసుకొని వారి కుటుంబాలకు అండగా ఒక్కొక్క కుటుంబానికి 100 చొప్పున భోజనాలు పంపించారు. అణగారిన వర్గాలకు, నిరుపేద కుటుంబాలకు మన ఆత్మబంధు ఎల్లప్పుడు అండగా ఉంటుందని బుసిరెడ్డి పాండురంగారెడ్డి గారు పిలుపునిచ్చారు. సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్స్ 9581742356-7799585859 ను సంప్రదించవలసినదిగా కోరారు. నిరుపేదలని ఆదరిద్దాం అనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ లో గొడుగులు పట్టుకొని సమ్మె జయప్రదం

ఆదిలాబాద్ :అమృత్ తెలంగాణ: కేంద్రంలో కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని బీజేపీ పాలనలో నిరుద్యోగం పేదరికం పెరిగిపోయిందని అన్నమొల్ల కిరణ్ అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే భారతదేశ కార్మిక వర్గం అనేక పోరాటాలు చేసి ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా సవరణలు చేస్తూ నాలుగు లేబర్ కోడ్ లుగా తీసుకువచ్చిందని అన్నారు. కేంద్రం విధానాలు మార్చుకోకపోతే బీజేపీని గద్దె దింపుతామని అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం సమ్మె చేపట్టారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. వర్షం పడుతున్న లెక్కచేయకుండా నిరసన తెలిపి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హెూరెత్తించారు.

# ఎల్ఐసి డివిజనల్ కార్యాలయంలో సమ్మె

హైదరాబాద్:అమృత్ తెలంగాణ: కేంద్ర కార్మిక సంఘాలు, ఇండిపెండెంట్ ఫెడరేషన్లు ఇచ్చిన పిలుపుమేరకు నేడు అఖిలభారత జాతీయ ఒకరోజు సమ్మె దిగ్విజయంగా జరుగుతున్నది. జాయింట్ ఫోరమ్ ఆఫ్ ఫైనాన్సు సెక్టార్ ఇన్ తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈరోజు హైదరాబాదు ఎల్ ఐసి డివిజనల్ కార్యాలయంలో సమ్మె ర్యాలీ నిర్వహించబడుతున్నది. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల నుంచి 600 మందికి పైగా ఈ సమ్మె ర్యాలీలో పాల్గొంటున్నారు. ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర నాయకులు ఎస్ వీరయ్య , ఏఐటియుసి రాష్ట్ర నాయకులు బోస్ గారు పాల్గొంటున్నారు వీరితోపాటు ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా, అఖిలభారత గ్రామీణ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి కూడా హాజరవుతున్నారు.

# నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే తన లక్ష్యమని అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : బేలాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల జిల్లా ఇన్చార్జి మంత్రి షెడ్యూల్ బిజీ ఉండడం కారణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించలేకపోయామన్నారు.. కానీ వర్షాకాలం సీజన్ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలగదు అని ఆలోచనతో ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించామని వివరించారు. పెండింగ్లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పిహెచ్సి భవనాన్ని సందర్శించినప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడేటప్పుడు ఆలోచించి మాట్లాడాలని హితోవ పలికారు. ఆదిలాబాద్ కు మంచి జరగాలని తన ఆలోచనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కృషితో ఇప్పటికే జిల్లాకు కార్పరేట్ స్థాయిలో సూపర్ స్పెషాలిటీ, పేషంట్ కేర్ ఆసుపత్రులను ఏర్పాటు చేశామన్నారు.. కార్యక్రమంలో మండల నాయకులు ఇంద్రజిత్ మురలీధర్. దత్తానికం రాము రాకేష్ నవీన్ మోరేష్ గణేష్ విజయ్ అశోక్ రెడ్డి కర్ణాకర్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు

# నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి: సీపీఐ(ఎం)



మునుగోడు :అమృత్ తెలంగాణ: కార్మికులకు నష్టం కలిగించే 4 లేబర్ కోడ్ ల ను వెంటనే రద్దు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం మునుగోడు మండల కేంద్రంలో అఖిలభారత సార్వత్రిక సమ్మె పిలుపుమేరకు సిఐటియు, ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన అన్నారు. ప్రజల కష్టార్జితంతో నిర్మించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ కార్పొరేట్ శక్తులకు అప్ప చెప్పవద్దని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్మికులకు 10 గంటలు పని చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాలలో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను ముందుకు తెచ్చిందని ఆయన అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి కొట్టేందుకు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాపాడుకునేందుకు పోరాటాలు నిర్వహించాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, చాలీచాలని జీతాలతో కార్మికులు జీవనోపాధి కొనసాగిస్తున్నారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి , మండల కమిటీ సభ్యులు యాస రాణి శ్రీను, వేముల లింగస్వామి, వడ్లమూడి హనుమయ్య,యాట యాదయ్య,

కొంక రాజయ్య, సిఐటియు అధ్యక్షులు రాజీవ్ ,ఉపాధ్యక్షులు లక్ష్మయ్య, జీడిమడ్ల దశరథ ,ప్రధాన కార్యదర్శి బుడిగపాక లింగస్వామి,సహాయ కార్యదర్శి అరుణ ,జలంధర్, కార్యదర్శులు శివశంకర్ ,సంజీవ ,లింగయ్య ,కోశాధికారి వంపు యాదయ్య , సుజాత సునీత సంధ్యారాణి లింగయ్య ,ఆశ యూనియన్ వి నిర్మల ,కవిత ,లక్ష్మి, కమలమ్మ ,లింగమ్మ, కమల తదితరులు పాల్గొన్నారు.

# నిఘా కట్టు దిట్టం



మంచిర్యాల:అమృత్ తెలంగాణ: జిల్లా కేంద్రం లో పోలీసులు నిఘా కట్టు దిట్టం చేశారు. ఎలాంటి అవంచనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా ప్రత్యేక బృందల తో పట్టణం లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణం లో రౌడీ షీటర్స్, అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ పేర్కొన్నారు.బుధవారం అర్ధరాత్రి 50 మంది స్పెషల్ టీం పోలీసుల తో పట్టణంలోని పలు కాలనీలు జల్లెడ పట్టారు. అనుమానితులు, మద్యం తాగి వాహనం నడిపే వారి ని అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చారు.గతం లో పలు కేసుల్లో నేరస్థులు గా ఉన్న వారి వివరాలు సేకరించి వారి ఇంటికి వెళ్లి ప్రస్తుత వారి స్థితి గతుల పై ఆరా తిశారు.పద్దతి మార్చుకోవాలని లేకపోతే పిడి యాక్ట్, నగర బహిష్కరణ లాంటి చట్ట పరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఘాటు గా హెచ్చరించారు.రౌడీ షీటర్ లు, అనుమానితులు నిత్యం అందుబాటులో లో ఉండాలని వేరే ఇతర గోడవల్లో తల దూర్చాకూడదని సూచించారు.చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతు అల్లర్లు సృష్టించే వారు ఎంతటి వారు అయిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.శాంతి భద్రతల పరిరక్షణ లో భాగం గా జిల్లా లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు చేపట్టనున్నట్లు డీసీపీ తెలిపారు. అయన వెంట మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, సీఐ లు ప్రమోద్ రావు, ఆకుల అశోక్ కుమార్, ఎస్ ఐ లు తిరుపతి, కిరణ్, సిబ్బంది ఉన్నారు..

# మిల్లు వర్కర్లకు ముంబైలోనే ఇండ్లు కట్టివ్వాలి..


హైదరాబాద్: ముంబైలోని ఆజాద్ మైదానంలో బుధవారం "గిర్నీ కంగర్ సంయుక్త లడా సమితి" ఆధ్వర్యంలో గిర్ని కంగర్ వారసుల లాంగ్ మార్చ్ ఘనంగా జరిగింది. మహామోర్చా ప్రధాన డిమాండ్ ముంబై బయట ఉన్న "వాంగిని" "సేలు" వంటి మారుమూల ప్రాంతాలలో కాకుండా, ముంబైలోనే ఎన్.టి.సి భూమిలో వారి కోసం ఇళ్ళు నిర్మించాలి. అయితే బిల్డర్లు తమకు ఇళ్లు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని వక్తలు ఆరోపించారు. న్యాయవాది ఉదయ్ భట్, కామ్రేడ్ విజయ్ కులకర్ణి, కామ్రేడ్ ప్రకాష్ రెడ్డి, బాబన్ కాంబ్లే, అనేక మంది ఇతర నాయకులతో సహా కార్మిక సంఘాల నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మహా ప్రదర్శనకు మహారాష్ట్రలోని అనేక గ్రామాల నుంచి వేలాది మంది కార్మికులు హాజరయ్యారు. ఈ ప్రభుత్వం అదానీ, అంబానీలకు అనుకూలంగా ఉందని ప్రకాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# గ్లామర్ షోలో నిన్ను కొట్టేవారే లేరు 'మృణాల్'




2019లో వచ్చిన 'సూపర్ 30' సినిమాలో హృతిక్ రోషన్ సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మృణాల్ ఠాగూర్.. తన టాలెంట్, అందం, అద్భుతమైన అభినయంతో సినీ ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు అందుకున్న నటి. టెలివిజన్ ద్వారా కెరీర్ ప్రారంభించిన ఆమె, హిందీ టీవీ సీరియల్స్‌లో మెరిసి, సినిమాల వైపు అడుగులేశారు. ఆమె నటనతో మెప్పించి, అతి తక్కువ కాలంలోనే బాలీవుడ్‌లో వరుస ఛాన్స్ లు అందుకుంది. 2019లో వచ్చిన 'సూపర్ 30' సినిమాలో హృతిక్ రోషన్ సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు ఇక బాలీవుడ్‌లో అనంతరం అమ్మడు పలు వెబ్ సీరీస్ లలో కూడా మంచి క్రేజ్ అందుకుంది. అనంతరం మెల్లగా టాలీవుడ్‌లోనూ అడుగు పెట్టారు. తెలుగులో ఆమె చేసిన తొలి చిత్రం 'సీతారామం' ఏ స్థాయిలో సక్సెస్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. హను రాఘవపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్ సరసన ఆమె 'సీత' పాత్రలో అదరగొట్టారు. ఈ మూవీతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఇన్ని సినిమాలు చేయడమెలా? ఆ సినిమా తరువాత బాలీవుడ్‌లో కూడా ఆమెకు మంచి ఆఫర్లు వచ్చాయి. 'సీతారామం' తర్వాత మృణాల్ టాలీవుడ్‌లో వరుస సినిమాలతో బిజీగా మారింది. నాని హీరోగా నటించిన 'హాయ్ నాన్న' మూవీలో కూడా ఆమె ప్రధాన పాత్రలో కనిపించారు. ఈ మూవీ మరో హిట్ కావడంతో మృణాల్‌కు టాలీవుడ్‌లో మరింత క్రేజ్ పెరిగింది. ఆమె నటన, ఎమోషనల్ స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తాజాగా మృణాల్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలు షేర్ చేశారు. అందులో ఆమె తెల్లటి కలర్‌లో రంగుల డిజైన్ ఉన్న లాంగ్ గౌన్‌లో చాలా అందంగా మెరిసిపోతున్నారు. ఆమె సింపుల్ స్టైల్, క్యూట్ లుక్స్ అభిమానులను ఆకట్టుకున్నాయి. బ్యాక్‌లెస్ డ్రెస్‌లో ఆమె క్యూట్ అండ్ క్లాసీగా కనిపించారు. మేకప్ కూడా సింపుల్‌గా, నేచురల్ గ్లోతో ఉన్నది. ఫ్యాన్స్ ఈ స్టిల్స్‌పై పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం మృణాల్ టాలీవుడ్ బాలీవుడ్‌లో పలు ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్నారు. సన్ ఆఫ్ సర్దార్ సినిమాతో పాటు మరో మూడు హిందీ సినిమాలు ఆమె చేతిలో ఉన్నాయి. ఇక అడివి శేష్ తో డెకయిట్ అనే సినిమా చేస్తోంది.

# కృతి శెట్టి వాలెంటైన్ వైబ్స్.. పొట్టి గౌనులో ఇలా.



. టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కృతి, తెలుగుతో పాటు తమిళ చిత్రాలపై కూడా దృష్టి పెట్టింది. క్యూట్ హీరోయిన్ కృతి శెట్టి, 'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్‌లో సాలిడ్ ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. తొలి సినిమాతోనే సెన్సేషన్ క్రియేట్ చేసిన కృతి తన లుక్స్‌తో యూత్‌లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ను సంపాదించుకుంది. ఆ తర్వాత బంగార్రాజు, శ్యామ్ సింగరాయ్, ది వారియర్ వంటి చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల మరింత దగ్గరైంది. టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కృతి, తెలుగుతో పాటు తమిళ చిత్రాలపై కూడా దృష్టి పెట్టింది. ఇన్ని సినిమాలు చేయడమెలా? అయితే, వరుసగా వచ్చిన 'మాచర్ల నియోజకవర్గం, ది వారియర్, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, కస్టడీ వంటి సినిమాలు బాక్సాఫీస్ వద్ద అంతగా రాణించకపోవడం ఆమెకు కాస్త నిరాశని కలిగించింది. సక్సెస్ కోసం ఎదురు చూస్తున్న కృతి, ఇలాంటి స్లో ఫేజ్‌లో కూడా సోషల్ మీడియాలో తన స్టైలిష్ ఫోటోషూట్స్‌తో హవా చూపిస్తుంది. ఫ్యాన్స్‌తో టచ్‌లో ఉంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రెండింగ్‌లో నిలుస్తుంది. తాజాగా కృతి వాలెంటైన్స్ డే స్పెషల్‌గా వైట్ ఫ్లోరల్ గౌన్‌లో ఫోటోషూట్ చేసి ఇన్‌స్టాలో షేర్ చేసింది. ఈ స్టిల్స్‌లో ఆమె గ్లామర్ టచ్‌తో క్యూట్ లుక్స్ కనబరిచింది. పచ్చని పువ్వుల బొకే పట్టుకుని, స్వీట్ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ ఫోజులిచ్చింది. ముఖ్యంగా ఆమె చిరునవ్వు, సింపుల్ మెకప్ తో నేచురల్ లుక్‌లో కనిపించి ఫ్యాన్స్‌ను ఫిదా చేసింది. "వాలెంటైన్స్ డే లేదా గాలెంటైన్స్ డే మీరు ఏది సెలబ్రేట్ చేస్తున్నారు?" అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్‌కి ఫ్యాన్స్ నుంచి రిప్లైలు వెల్లువలా వచ్చాయి. రాజకీయ నాయకుడిపై బ్రహ్మానందం కామెంట్స్! కృతి సినిమాల్లో ప్రస్తుతం కాస్త స్లోగానే ఉన్నా, సౌత్‌లో కొన్ని ప్రాజెక్ట్స్‌లో చర్చలు జరుగుతున్నాయి. తమిళంలో ఒక బిగ్ హీరోతో నటించే అవకాశం ఉందని టాక్. అలాగే టాలీవుడ్‌లో ఒక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కోసం కూడా ఆమెను అనుకుంటున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కృతి, తన నెక్స్ట్ మూవీస్‌తో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఈ ఫోటోషూట్‌తో కృతి మరోసారి ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. మరీ ఈ అందంతో అమ్మడు ఎలాంటి అవకాశాలు అందుకుంటుందో చూడాలి

# పుష్పరాజ్ కుమార్తె స్టన్నింగ్ లుక్



పావని కరణం .. ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్న పేరు. తెలుగు ఫిలింసర్కిల్స్ లోను ఈ తెలుగమ్మాయి ప్రతిభ గురించి చర్చ సాగుతోంది. పావని కరణం .. ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్న పేరు. తెలుగు ఫిలింసర్కిల్స్ లోను ఈ తెలుగమ్మాయి ప్రతిభ గురించి చర్చ సాగుతోంది. పుష్ప 1, పుష్ప 2 చిత్రాల్లో నటించిన పావని కరణం ఎంపిక చేసిన పాత్రకు పూర్తి న్యాయం చేసింది. అసలు ఇంటి పేరుతో ఒక ఐడెంటిటీ లేని పుష్పరాజ్ కి అన్న కూతురు కావేరిగా పావని నటించింది. అంతేకాదు సొంత అన్నయ్య అజయ్.. పుష్పరాజ్ ని అవమానిస్తుంటే, చివరికి అతడిని అన్ని అవమానాల నుంచి బయటపడేసే కీలక పాత్రలో పావని కనిపించింది. పుష్ప 2 క్లైమాక్స్ ని అర్థవంతంగా ముగించేందుకు సుకుమార్ ఎంతో తెలివిగా అజయ్ కుమార్తె పాత్రను ఉపయోగించుకున్నారు. ఆ పాత్రలో అద్భుతంగా నటించింది పావని. ఇన్ని సినిమాలు చేయడమెలా? పల్లెటూరిలో ఇంటి పేరు లేకుండా ఉంలికున్న దానికొడుకు అంటే ఆ బాధ ఎలా ఉంటుందో పల్లెల్లో నివశించే పుష్పరాజ్ లాంటి వ్యక్తులకు తెలుస్తుంది. ఆ బాధను తెరపై పండించడంలో బన్ని వందశాతం మార్కులు కొట్టేసాడు. అలాగే కీలక సమయంలో అజయ్ కుమార్తె పై సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. అకస్మాత్తుగా కొందరు పోకిరి కుర్రాళ్లు పుష్పరాజ్ అన్న కూతురు కావేరి (పావని)ని కిడ్నాప్ చేసాక యాక్షన్ డ్రామా మరో లెవల్ కి చేరుకుంటుంది. చిన్నాన్న పుష్పరాజ్ పాత్రలో ఎమోషనల్ కంటెంట్ ని ఎలివేట్ చేసేందుకు పావని పాత్ర సహకరించింది. ఇక పావని పదహారణాల పల్లెటూరి తెలుగమ్మాయి ఎలా ఉంటుందో అలాగే తెరపై చీరల్లో మురిపించింది. క్లైమాక్స్ లో పావనిని అడ్డు పెట్టుకుని పుష్పరాజ్ పై ప్రతీకారం తీర్చుకోవాలనుకున్న రౌడీలకు జీవితంలో మర్చిపోలేని విధంగా ఏం జరిగిందన్నది తెరపైనే చూడాలి.




# గోల్డెన్ ఛాన్స్ అందుకున్న శర్వరి



నజీరుద్దీన్ షా, వేదంగ్ రైనా, దిల్జిత్ దోసాంజ్ ప్రధాన పాత్రల్లో ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. నజీరుద్దీన్ షా, వేదంగ్ రైనా, దిల్జిత్ దోసాంజ్ ప్రధాన పాత్రల్లో ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాతో మరో మాస్టర్‌పీస్‌ను అందించాలని డైరెక్టర్ ఇంతియాజ్ అలీ ప్లాన్ చేస్తున్నాడు. సినిమాను ఈ వేసవిలో సెట్స్ పైకి తీసుకెళ్లి షూటింగ్ మొదలుపెట్టి నెక్స్ట్ ఇయర్ వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ చేయాలని చూస్తున్నారట ఇదిలా ఉంటే డైరెక్టర్ ఇంతియాజ్ అలీ ఇప్పుడు ఈ సినిమాలో హీరోయిన్ ను ఫిక్స్ చేసినట్టు తెలుస్తోంది. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు శర్వరి అయితే సరిగ్గా సెట్ అవుతుందని ఆమెను ఎంపిక చేశారట చిత్ర మేకర్స్. ఇంతియాజ్ రాసుకున్న పాత్రకు శర్వరి అయితేనే సరిగ్గా సరిపోతుందని అందరూ భావిస్తున్నారట. శర్వరి గురించి ఆడియన్స్ కు ప్రత్యేక పరిచయం చేయనక్కర్లేదు. శర్వరి గత కొన్నేళ్లుగా బాలీవుడ్ లో పలు సినిమాల్లో నటించింది. ఆమె నటించిన సినిమాల్లో వేదా, బంటీ ఔర్ బబ్లీ2 మరియు ముంజ్యా సినిమాలు బాగా గుర్తింపు తెచ్చుకున్నాయి. శర్వరి నటించిన అన్ని సినిమాల్లో ముంజ్యా సినిమా మాత్రమే బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ ను వసూలు చేయడంతో పాటూ విమర్శకుల ప్రశంసలను కూడా అందుకుంది. అయినప్పటికీ శర్వరి నుంచి ఇప్పటివరకు అద్భుతమైన నటన ఇప్పటివరకు ఏ సినిమాలోనూ చూడలేదు. అయితే ఇంతియాజ్ అలీ ఎప్పుడూ తన సినిమాల్లో హీరోయిన్ పాత్రలపైనే ఎక్కువ దృష్టి పెడతాడు. ఆయన గత సినిమాలు తమాషా, హైవే, జబ్ వి మెట్, లవ్ ఆజ్ కల్ లో హీరోయిన్ పాత్ర బాగా హైలైట్ అయిన విషయం తెలిసిందే. అలాంటి డైరెక్టర్ తో కలిసి పని చేయాల్సి రావడం నిజంగా శర్వరికి చాలా మంచి అవకాశం.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com